REGD. No. H 18 విడిప్రతి 0-25 పై. 20-10-67 శుక్రవారం

వాయిదాలలో రేడియోలు,
ట్రాన్సిస్టర్లు,
స్టీలు బీరువాలు.
* * *
యస్వీ ఏజన్సీసు
బృందావనము - నెల్లూరు

# జమీన్‌రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు
సంపుటి 39 ★ సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి ★ సంచిక 41

నెల్లూరు శిలామహల్‌లో
21-10-67 శనివారంనుండి
The Family Jewels
జెర్రీలూయిస్ నటించిన
గొప్ప హాస్యచిత్రం

### కాంగ్రెస్‌వాదుల్లో అలసట, నిస్తబ్ధత

## మంత్రివర్గ విస్తరణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల తర్వాతేనట!

ఆనం చెంచుసుబ్బారెడ్డిగారు నిర్యాణం చెంది, మిత్రులను శత్రువులను సమానంగా దుఃఖభరితంచేసిన అనంతరం రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని ప్రస్తుత మంత్రులశాఖల పునర్విభజనకూడా జరుగుతుందని పలువురు ఆశించారు. బాగా ఆలోచించినమీదట ఇలాంటి మార్పులను ప్రస్తుతానికి తలపెట్టకూడదని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది.

వచ్చేనెలలో ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికలు జరగవలసివున్నాయి. దీనికి సంబంధించిన పనికూడా మందకొడిగా జరుగు

**మా హైదరాబాదు విలేఖరి**

తున్నట్లు కనిపిస్తున్నది. ఇంతవరకు జిల్లా రిటర్నింగు ఆఫీసర్ల నియామకం జరగలేదు. అసంతృప్తివర్గంవారుకూడా తమ భవిష్యత్తును దైవాధీనం చేసి చేతులు ముడుచుకొని కూర్చున్నారు. పూర్వంవలె ఈ రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం గూర్చి ఎలాంటి దుమారంలేకపోవడం చూస్తే మన రాజకీయవేత్తల్లో, ముఖ్యంగా కాంగ్రెస్‌వాదుల్లో ప్రేళ్లదన్నుకొనిపోతున్న అలసట నిస్తబ్ధత ఎంతగాఢమైనదో ద్యోతకమవుతున్నది. అధికారవర్గానికి సంబంధించినంతవరకు, అసంతృప్తివర్గం మూకీభావం, వారి చేతకానితనాన్ని సూచించడమేకాక, ప్రస్తుత ప్రదేశ్ కాంగ్రెస్ నాయకత్వం నిష్పాక్షికంగా ఎన్నికలు జరిపించగలుగుతుందనడానికి తార్కాణంగా భావిస్తున్నారు.

ఏమైనా ఈ సంస్థకు సంబంధించిన ఎన్నికలు సమాప్తమై, నూతన అధ్యక్షుడు కార్యవర్గంఎన్నిక జరిగిపోయినతరువాతనే మంత్రివర్గంలో మార్పులు చేర్పులు గూర్చి ముఖ్యమంత్రి ఆలోచిస్తారని ఆయనకు సన్నిహితులుగావున్న వర్గాల వారి ద్వారా తెలుస్తున్నది.

వివిధ రాష్ట్రాల్లో ప్రస్తుతం అధికారంలో వున్న ప్రదేశ్ కాంగ్రెస్ నాయకులను తప్పించి పశ్చిమ బెంగాల్‌లో వలె అడ్‌హాక్ సంఘాలను కాంగ్రెస్ అగ్రనాయకత్వం నెలకొల్పాలనే కోరికను ముఖ్యంగా అసంతృప్తి వర్గాలు వెలిబుచ్చుతున్నాయి. అగ్రనాయకత్వం కూడా ఎట్టకేలకు పశ్చిమ బెంగాలులో ఇలాంటి చర్య తీసుకున్నది. బీహారులో కూడా తీసుకొనవచ్చును. కాని ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అలాంటి కోరికను ఇంతవరకు ఎవరు బహిరంగంగా కోరలేదు. మరి ఇది, కార్యదర్శులు కూడా లేకుండా ఆరు మాసాల నుండి ప్రదేశ్ కాంగ్రెస్‌ను నిర్వహించగలిగిన బ్రహ్మానందరెడ్డి గారి ప్రతిభా విశేషాలపట్ల ప్రశంసో లేక కాంగ్రెస్ వాదుల సాధారణ అనాసక్తత, నిర్వ్యాపారతలకు తార్కాణమో చెప్పలేము. కాని వాతావరణం ఒక్క హైదరాబాదులోనే కాక వివిధ జిల్లాలలో కూడా చూస్తే, కాంగ్రెస్ వ్యవస్థపట్ల ఆసక్తి శ్రద్ధ పూర్తిగా లోపించిందని చెప్పవలసివుంటుంది.

ఫిబ్రవరిలో జరిగిన సాధారణ ఎన్నికల వైనం, తరువాత కాంగ్రెస్ అభ్యర్థుల నోడించి ఎన్నికైన తిరుగుబాటుదార్లను

—కొరవ 6 వ పేజీలో

### మునిసిపల్ రాజకీయాలు

## గూడూరు ఛేర్మెన్ ఎన్నికలో విచిత్రాలు, విడ్డూరాలు

### ప్రజావాణి ఒకరికనుకూలంగా ధ్వనించింది; కౌన్సిలు ఇంకొకరికి అనుకూలించింది!

### తమ్ముణ్ణి వ్యతిరేకించాడు ఎస్. వి. కృష్ణారెడ్డి; సిద్దారెడ్డి వెంకటరామరెడ్డిని బలపరచాడు సిద్దయ్యనాయుడు

**అదృశ్యుడైన అడివయ్య భార్య బహిరంగసభలో భోరున ఏడ్చింది!**

( మా ప్రత్యేక పరిశీలకుడు )



అనుకున్నట్లుగానే శ్రీ పొన్నలూరు కోటారెడ్డిగారు గూడూరు మునిసిపల్ ఛేర్మెన్‌గా ఎన్నికైనారు; వూహించినట్లుగానే శ్రీ సిద్దారెడ్డి వెంకటరామరెడ్డి పోటీ చేశారు. అయితే కొన్ని వింతలు, విడ్డూరాలు జరిగాయి. రాజకీయాలన్నప్పుడు యిలాంటివేమీలేకుంటే స్వారస్యమేముంది!

ఎన్నికలలో మామూలుగా జరిగేటట్లే, ఈ ఎన్నికలోకూడా ఒక కౌన్సిలరు అదృశ్యుడైనాడు — అయినాడనడంకంటే, చేయబడినాడనడం వుచితంగావుంటుంది. ఎటువంటి విపరీత పరిస్థితుల్లోకూడా స్వంత తమ్ముణ్ణి బలపరచవలసిన శ్రీ ఎస్. వి. కృష్ణారెడ్డి, కోటారెడ్డిగారిని బలపరచారు. సహజంగా కోటారెడ్డి అభ్యర్థిత్వాన్ని అభిమానించవలసిన శ్రీ సిద్దయ్య నాయుడు, వెంకటరామరెడ్డిని ఆశీర్వదించారు. మునిసిపల్ ఎన్నికలవరకు అనాసక్తంగా, దూరంగావుండిన పెళ్లేటి వెంకటకృష్ణారెడ్డి ప్రత్యర్థులు ఛేర్మెన్ ఎన్నిక వచ్చేవరకు సంధుకున్నారు. పట్టణ ప్రజావాణి శ్రీ వెంకటరామరెడ్డికి అనుకూలంగా ప్రతిధ్వనించింది; కౌన్సిలు సభ్యులు కోటారెడ్డికి అనుకూలించారు. రచ్చకెక్కి మాటుమణిగుండిన మైకా రాజకీయాలు ఈ ఎన్నికలో బాగపొరబడ్డాయి. ఇవీ సంక్షిప్తంగా ఈ ఎన్నికలోని వింతలు, విడ్డూరాలు, విశేషాలు!

సిద్దయ్య నాయుడుగారి వర్గీయుడుగా భావింపబడుతుండిన శ్రీ వాకాటి సుబ్బరామరెడ్డిగారిని దీర్చి. వైస్ ఛేర్మెన్ అభ్యర్థిగా పొన్నలూరు కోటారెడ్డిగారు ఎప్పుడైతే ప్రకటించారో, అప్పుడే తల్లక్రిందులై పోయాయి మునిసిపల్ రాజకీయాలు. వెంకటరామరెడ్డిగారి పోటీ వుత్పన్నమైంది అప్పుడే. పెళ్లేటి వెంకటకృష్ణారెడ్డి, మారంరెడ్డి రమణారెడ్డి వగైరాలంతా కోటారెడ్డిగారికి వ్యతిరేకంగా రంగంలోకి దిగింది అప్పుడే. ఎస్. వి. కె తమ్ముడు వెంకట్రామరెడ్డిని కాకుండ, కోటారెడ్డిగారిని బలపరచుటకు నిర్ణయించుకోవడం, సిద్దయ్యనాయుణ్ణి వెంకట్రామరెడ్డికి అనుకూలం చేసింది. వర్గాలు ఛిన్నమై, నూతన రూపాన్ని పొందింది కూడా అప్పుడే. అది ఎందువల్లనో ఏమోగాని, వెంకట్రామరెడ్డి అభ్యర్థిత్వం పట్ల టవునులో అనూహితమైన అనుకూలత ద్యోతకమైంది. వెంకటరామిరెడ్డి ఓటమి. ఎన్నిక సమయంలో మునిసిపల్ ఆఫీసు వద్దచేరిన వేలాది జనాన్ని ఉద్విగ్నులను గావించడం గమనించినప్పుడు ప్రజావాణి

—కొరవ 6 వ పేజీలో

## నిజమైన గాంధేయ మార్గంలో గాంధీ జయంతి



గాంధీజయంతి అంటే సభలు, వుపన్యాసాలు, గాంధీగారిపట్ల మొసలికన్నీళ్లు, ధర్మోపదేశాలు తప్ప, నిజమైన గాంధేయత ఆచరణలో కనుపించదు. నెల్లూరు బి.ఇ.డి. కాలేజి విద్యార్థినీ విద్యార్థులు అక్టోబరు 2 తేది గాంధీజీ నిర్దేశించిన నిర్మాణ కార్యక్రమంతో గాంధీ జయంతిని జరిపి, మార్గదర్శకులైనారు. మురికివాడలను వూడ్చుతున్న బి. ఇడి. విద్యార్థులు (కెమారా వంక చూడలేనంత నిమగ్నులు కాలేకపోయారను కోండి!); పేదపిల్లలకు శుభ్రంగా స్నానం చేయిస్తున్న బి. ఇ. డి. విద్యార్థినులు.

—ఫోటోలు : శ్రీ ఎ. వి. వి. నరసింగరావు.



# ఏ. సి. స్మృతి-పంచాయతీలు - పల్లె ప్రజల, సంస్థల సంతాపం

నెల్లూర్లో యింకా అప్పుడే యేమీఅనుకో లేదుగాని, కావలిలో అప్పుడే ఏ. సి. మెమోరియల్ కమిటీ స్థాపన దాకా పోయింది. కావలితాలూకా ప్రముఖులు మొన్న 2 తేది కావలి పంచాయితీ సమితి ఆఫీసులో సమావేశమై ఏ. సి. మెమోరియల్ కమిటీ నొకదానిని యేర్పాటు చేసుకున్నారు. ఈ కమిటీ వుద్దేశ్యాలేమిటంటే- కీర్తిశేషులు ఏ. సి. సుబ్బారెడ్డిగారి కాంస్య విగ్రహం కావలిలో ప్రతిష్ఠాపన చేసుకోవాలి. ప్రతియేటా ఆయన స్మృతి సూచకంగా వ్యవసాయ - పశుప్రదర్శనలు, క్రీడోత్సవాలు నిర్వహించాలి.



ఈ కమిటీ అధ్యక్షులుగా డాక్టర్. పి. వెంకటామయ్య, ఉపాధ్యక్షులుగా కరి

## కావలిలో కాంస్యవిగ్రహ స్థాపనకు నిర్ణయం

ముల్లా సాహెబ్ అఫాన్, కార్యదర్శిగా పెండెం రవీంద్రనాద్, కోశాధికారిగా కె. రామకృష్ణారెడ్డి, సభ్యులుగా వి. అయ్యప రెడ్డి, టి. సుబ్బానాయుడు(శాసనసభ్యుడు) టి. చినకొండప నాయుడు, తిప్పారెడ్డి రామిరెడ్డి, టి. పెరుమాళ్లు నాయుడు, సూనె సుబ్రహ్మణ్యం, ఇ. చెంచురెడ్డి, ఎ. వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. ఉదారులైన దాతలు తమ విరాళాలను- కె. రామకృష్ణారెడ్డి (ఉషా ఎలక్ట్రికల్స్) కోశాధికారి, ఏ. సి. మెమోరియల్ కమిటీ, కావలి- అడ్రసుకు పంపమని కోరుతున్నారు.

అనుకొన్న కార్యక్రమాల్ని కమిటీవారు నిర్విఘ్నంగా కొనసాగించగలరనే విశ్వసిస్తున్నాం.

### పంచాయతీల తీర్మానాలు

ఆత్మకూరు గ్రామ పంచాయితీ వారు గత 30 తేది సర్పంచ్ బి. యానాదిరెడ్డి అధ్యక్షతన సమావేశమై ఏ. సి. మృతికి గాఢసంతాపాన్ని తెల్పుతూ తీర్మానం గావించారు.

ముత్తుకూరు పంచాయితీవారు గత 27 తేది సర్పంచ్ శ్రీ వేమన జానకిరామయ్య అధ్యక్షతన సమావేశమై ఏ. సి. మరణం పట్ల తమ సంతాపాన్ని తెలియజేస్తూ తీర్మానం చేశారు.

దర్శి తాలూకా కొచ్చెర్లకోటపంచాయితీ సర్పంచ్ తడికమళ్ల సుబ్బరామయ్య అధ్యక్షతన 24 తేది సమావేశమై- తమగ్రామానికి ప్రత్యేకించి గుండ్లకమ్మ నన్లయిదానిల్ నిర్మాణానికి కీ. శే. ఏ. సి. చేసిన కృషి మరువరానిదంటూ వారి మరణానికి సానుతాపం తెలియజేస్తూ తీర్మానం గావించారు.

సూళ్లూరుపేట పంచాయితీ సర్పంచ్ కె. రాజగోపాలశెట్టి అధ్యక్షతన సమావేశమై ఏ. సి. ఆత్మకు శాంతి కలుగుగాక అని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి తమ సంతాపాన్ని తెలియజేస్తూ తీర్మానం గావించారు.

కనిగిరి తాలూకా చంద్రశేఖరాపురం పంచాయతీ వారు సర్పంచ్ జానపాటి నారాయణస్వామి గారి అధ్యక్షతన సమావేశమై ఏ. సి. మరణంపట్ల సంతాపతీర్మానం గావించారు. ముఖ్యంగా చంద్రశేఖరాపురం చెరువుకు దొక్కలేటినుండి కాల్వ త్రవ్వించే పథకానికి వారుచేసినకృషి, వెలిగండ్ల ప్రాంతాభివృద్ధికి వారు చేసిన సేవ మరువుకు రానివన్నారు సర్పంచ్. తాత

—తరువ 11 వ పేజీలో



నెల్లూరులోని వివిధసంస్థలతో ఏ. సి. కి సంబంధంవుంది. ఏదోఒక రూపంలో ఏ. సి. సహాయాన్ని పొందని సంస్థలేదు. శ్రీ కస్తూరిదేవి విద్యాలయం కమిటీ సభ్యులుగా, స్కూలు సహాయార్థం శ్రీమతి ఎం. ఎస్. సుబ్బులక్ష్మి పాటకచ్చేరి జరిగిన సందర్భంలో, తక్కిన సభ్యులతో శ్రీ ఏ. సి. ని ప్రైదితంలోచూడవచ్చు.

# పల్లెల వార్తావళి

## వాకాడు దశరావేడుకలు-దంపూరు, గుర్రంకొండ విద్యుత్ప్రసారోత్సవాలు - వెంకటగిరి, కోట గ్రామాలలో మంత్రి సిద్దారెడ్డి పర్యటన-దర్శి, పొదిలి, కనిగిరి క్షామవార్తలు; ఆకలిచావులు తప్పవని హెచ్చరిక - ఎర్రఓబనపల్లె హత్య - ఇతర వార్తలు

### వాకాడు దసరా వేడుకలు

దసరా పండగకూడా దిగులుగావచ్చి వెళ్ళిపోయింది. నెల్లూరు వీధుల్లో చెప్పుకో తగ్గ వేడుకలూ లేవు, గీడుకలూలేవు. ఇప్పుడు ఏ పండగొచ్చినా వేడుకలు చేసుకునే దశలోవుందా మనజాతి?

పూర్వమైతే దసరారోజుల్లో పులివేషాల హడావుడి ఎంతగా వుండేది! పురాణపురుషుల వేషాలేసుకుని ఎంత సందడి కల్గించేవారు! పేరుకు ఇప్పుడుకూడా సన్నజనం వేషాలేసుకొని నెల్లూరు పురవీధుల్లో సందడి చేస్తూ తిరిగారుకాని అందులో ఏ ప్రత్యేకతా లేదు. కడుపుకూటి ప్రేతకళతప్ప ఏటీవకళా కనపడలేదు. భీముడు వేషంలో వాకడు బీడితాగుతూ బీదినటోగుతూనో, అర్జునుడి వేషంలో బక్కచిక్కిన దుస్తుల్లో సైకిలెక్కి తిరుగుతూనో నయాపైసలేరుకుని పోతూనో కనపడుతూ వచ్చారు.

పూర్వమైతే పులివేషం వేసుకొచ్చి వీధిలో ఆడిపోయినవాడికి, ఏ అంగడివాడైనా సరే రూపాయికి తక్కువ యివ్వాలంటే జంకుగొంకుగా వుండేది. ఇప్పుడట్లాంటివి పదిపైసలు,హోటుమంటే పావలాడబ్బులు పడేసినా తృప్తిగా పోతున్నారు. మనం రోజురోజుకూ ఎంత దివాల్యా అయిపోతున్నామో, దేశం నానాటికి ఎంత బీదదైపోతున్నదో యీ బీద దసరా వుత్సవాలు హాకవిధంగా అర్థంపట్టి చూపుతున్నాయి.

నెల్లూరు టౌను పరిస్థితి యిట్లావుంటే పల్లెల్లో దసరా వేడుకలసంగతి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఈ పండగపూటల్లోనైనా నాలుగురకాల పిండివంటలు చేసుకుందామనుకొంటే చక్కెర దొరకదు; రవ్వ, గోధుమ, మైదా వగైరా పదార్థాలు దొరకని పల్లెలు ఎన్ని వున్నాయోకదా!

ఈ నీరస దయనీయ వాతావరణం మధ్య- ఒక్క వాకాడు గ్రామంలో అంత అట్టహాసంగా, అంత సందడిగా దసరా వుత్సవాలు జరిగినవన్నవుడు హాకవిధంగా ఆశ్చర్యంగానే వుంది. వాకాడులో యీ సంవత్సరం యింత సముసోత్సవంగా దసరా వేడుకలు జరగవల్సి వచ్చేదానికి కారణం హాకటి వుంది.

అన్నివూళ్ళ మాదిరిగానే వాకాడులో కూడా పార్టీలున్నాయి. అన్నివూళ్లమాదిరిగానే వాకాడులోనూ దేవాలయాలున్నాయి. ఒక్క దేవాలయంకాదు, మూడుదేవాలయాలున్నాయి. ఈ మూడింటికల్పి 3, 4 లక్షల చిరాస్తిదాకా వున్నదట. అన్ని లక్షల ఆస్తివున్నా చాలవూళ్ళ దేవాలయాం మాదిరిగానే వాకాడులోని మూడు దేవాలయాల్లో రెండు శిథిలావస్థలో వున్నాయి. మరి యింతఆస్తి దేవుడిపేరుతో కైంకర్యం అవుతూవుందిందా? ఏమో? అవిమాత్రం సాక్షాత్తు శిథిలావస్థలో వున్నాయి.

అట్లాంటిదశలో యీ దేవాలయాల యాజమాన్యం అవతలివారి పార్టీ నుండి

—తరువ 12 వ పేజీలో


ఆమె ఒక ఆఫీసు సూపర్నెండెంటు. ఎప్పుడూ చిరునవ్వుతో చురుగ్గా పని చేస్తుంది. టైపిస్టుగా చేరిన తను, స్వయం కృషివలన ఈ స్థాయికి చేరుకుంది. "నా ఉద్యోగం ఏకాగ్రతతో చేయగలుగుతున్నానంటే కారణం ఇంట్లో చీకు చింతలు లేకపోవటమే," అని చెప్పిందామె. "నా భర్త, నేను కలిసి సంపాయించటం మూలంగా మా ముగ్గురు పిల్లలకు గొప్ప చదువు చెప్పించటానికి, వారి అవసరాలు తీర్చటానికి వీలుంది. ఆర్నెల్ల క్రితం మా



మూడో పాప పుట్టగానే, ఇంక పిల్లలు వద్దని మే మిద్దరమూ నిర్ణయించుకున్నాము. నిజంగా నే నెంతో ఆనందంగావున్నాను."

ఆమె ఆనందంగావుంది—

మరి మీరు?



